## 79. సంసారం-పండుమిర్చి

రాధాకృష్ణ సన్న్యాసాశ్రమం స్వీకరించాలనే స్థిరమైన అభిప్రాయంతో వున్నాడు కాని అతని మిత్రులు అతన్ని వద్దని వారించారు. సంసారంలోనే ఎక్కువ సుఖం వుందని నచ్చచెప్పే ప్రయత్నం చేసారు.

మర్నాడు రాధాకృష్ణ చురుక్కుమనే కారం గల ఎర్రటి పండు మిరపకాయల కుప్ప ముందు కూర్చుని ఒక్కో మిరపకాయ తినసాగాడు. కొద్ది సేపటికి అతని మిత్రులకీ విషయం తెలిసి గబగబ అతని దగ్గరకి పరిగెత్తుకుని వచ్చారు. కళ్ళల్లోంచి, నోట్లోంచి నీళ్ళు కారుతూండగా వాటిని తింటున్న రాధాకృష్ణని చూసి అడిగారు వాళ్ళు.

"ఇదేం పని? కారం అని తెలిసీ వీటిని ఎందుకు తింటున్నావు?"

"ఏపిల్‌లా పండాయి కాబట్టి ఈ పండు మిరపకాయల్లో ఒక్కటైనా తియ్యది వుండదా అని వీటిని తింటున్నాను." జవాబు చెప్పాడు రాధాకృష్ణ.

"మూఢుడా! ఎర్రగా పండినా పచ్చిమిర్చిలో తీపి కాయ కోసం వెదకడం మూర్ఖుల పని." అరిచారు మిత్రులు.

"సంసారంలో సుఖాలని వెదికే మీకన్నా నాది మూర్ఖత్వమా?" నవ్వాడు రాధాకృష్ణ.

## 80. పిండి కొద్దీ రొట్టె

వయసు మళ్ళిన ఓ వ్యాపారస్థుడు ఓ రాత్రి నిద్రలో మరణించాడు. యమభటులు వచ్చి అతన్ని యమధర్మరాజు దగ్గరకి తీసుకు వెళ్ళారు. చిత్రగుప్తుడు అతని పాపపుణ్యాల చిట్టాని తిరగేసి చెప్పాక యముడు అతన్ని కొద్దికాలం స్వర్గానికి వెళ్ళి వుండమని తీర్పు చెప్పాడు.

ఆ ప్రకారం యమభటులు అతన్ని స్వర్గలోకంలోకి తీసుకెళ్ళారు. విశాలమైన తళతళలాడే రోడ్ల మీద అటు ఇటు వున్న ఎత్తైన పదంతస్థుల

భవంతులని చూస్తూ అతను యమభటులని అనుసరించాడు. యమభటులు ఆ రోడ్డుని దాటి ఓ మట్టిరోడ్డులోకి దారితీసారు. అక్కడున్న గుడిసెల్లోని ఓ గుడిసె ముందు ఆగి వారు అతనికి చెప్పారు.

"ఈ గుడిసే నీ నివాస స్థలం."

"ఇదేమిటి? మనం దాటివచ్చిన ఖరీదైన భవంతుల మాటేమిటి? నన్ను అందులో ఓ దాంట్లో వుంచచ్చుగా?" అడిగాడు ఆ వ్యాపారస్థుడు.

"మీరు భూమి మీద వుండగా మాకు పంపిన డబ్బుతో మీకు ఇంతకంటే చక్కటి వసతిని ఏర్పాటు చేయలేం." జవాబు చెప్పి వెళ్ళిపోయారు యమభటులు.

## 81. సావాస దోషం

ఓ మహాత్ముడు ఓ వూరి మీదుగా వెళ్తున్నాడు. కొందరు ఆసక్తిపరులు ఆయన్ని దర్శించి తమకేదైనా మంచి విషయాలు బోధించమని కోరారు. ఆయన కొద్ది క్షణాలు వారి వంక తేరిపార చూసి అడిగారు.

"చేపల గంపని ఎత్తుకున్న వాడితో సావాసం చేస్తే మీకు ఏం వాసన అంటుకుంటుంది?"

"చేపల వాసన." జవాబు చెప్పారు వారిలోని ఒకరు.

"అత్తరు, పన్నీరు అమ్ముకునే వారితో సావాసం చేస్తే?"

"సువాసన." జవాబు చెప్పాడు ఇందాకటి వ్యక్తి.

"ఇదే విధంగా కేవలం లౌకిక విషయాల మీద ఆసక్తి చూపే దుష్టులతో సావాసం చేస్తే దుర్గుణాలే మనకి అంటుకుంటాయి. అదే ధర్మబద్ధమైన ప్రవర్తన కలిగి, దైవభక్తి పరులైన వారితో సావాసం చేస్తే ఆ సద్గుణాలే మనకి అబ్బుతాయి. అందుచేత సజ్జన సాంగత్యం నిత్యం పొందాలి." బోధించాడు ఆ మహాత్ముడు.